సామెతకథలు

# కోమటి సాక్ష్యం

- శ్రీ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

ఒకానొకప్పుడు జ్యేష్ఠాదేవికి, లక్ష్మీదేవికి తమ అంద చందాలలో ఎవరు ఎక్కువ అనే విషయంలో తీవ్రమైన తగవులాట వచ్చెను. నేను అందకత్తె నంటే, నేను అందకత్తెనంటూ ఎవరి మట్టుకు వారే తమ సౌందర్యాన్ని పొగడు కోవడం మొదలు పెట్టారు. ఎంత సేపటికి వారు స్వయంగా రాజీ కుదుర్చుకో లేకపోయారు. వారిద్దరూ ఆ ప్రాంతంలో ఉన్న కోమటిని తమలో అందకత్తె ఎవ్వరో తేల్చి చెప్పమని యడిగిరి. సెట్టి ఆ వచ్చినవారిలో నొకతె పెద్దమ్మ, రెండవది చిన్నమ్మ అని తెలిసికొన్నాడు. అప్పచెల్లెళ్ళ తగవులాటలో తీర్పు చెప్పడం అతనికొక్క పెద్ద సమస్యగా తయారైనది. నిజానికి లక్ష్మి అందకత్తె. ఆ మాటంటే జ్యేష్ఠాదేవికి కోపం వచ్చి నన్ను దరిద్రుణ్ణిగా చేయవచ్చు. కాదని ముఖప్రీతి కోసం జ్యేష్ఠాదేవి అందకత్తె అంటే, లక్ష్మి తన్ను వరింపదేమో? ఎవరి పక్షం ఆశ్రయించి సాక్ష్యం చెప్పినా తనకే నష్టం వచ్చేటట్లు కనబడింది. యుక్తి యుక్తంగా తీర్పు చెప్పి ఇద్దర్ని సంతోషపెట్టి, తప్పుకొని పోవాలని తలచాడు.

వారి అందాన్ని ఎగా దిగా చూచినట్లు నటిస్తూ ఈ విధంగా సాక్ష్యం ఇచ్చాడు." పెద్దమ్మగారూ! నిజం చెప్పవలసివస్తే తమరు వెనుదిరిగి ఠీవిగా నడుస్తున్నప్పుడు మీ వన్నెచిన్నెలు, మీ తీరుతియ్యములు ఎంతో చూడముచ్చటగా ఉంటాయి. చిన్నమ్మగారూ! తాము ముందడుగు వేస్తున్నప్పుడు మాత్రం మీ ఆకారం ముద్దు మురిపములు గొల్పి ఎంతో కలకల్లాడుతూ కన్నుల పండువుగా ఉంటుంది. నేను చెప్పినట్లు మీరు నడచి చూస్తే అదే ఋజువౌతుంది." అనేటప్పటికి అప్పచెల్లెళ్ళిద్దరు మిక్కిలి సంతోషించారు. ఎవరి మట్టుకు వారు కోమటి తన్నే బాగా పొగిడాడని మెచ్చుకొంటూ అతడు చెప్పినట్లే నడిచారు. అనగా జేష్ఠాదేవి ఇంటికి దూరముగా బయటికి, లక్ష్మి ఇంటిలోకి ప్రవేశించారన్న మాట. గోడమీది పిల్లి వాటంగా సాక్ష్యం చెప్పి కోమటి గడువరాని గడ్డు సమస్యనుండి సులువుగా తప్పించుకోవడమే కాకుండా లక్ష్మి కటాక్షానికి కూడా పాత్రుడైనాడు.

తగవులందు ఇరుపక్షాలలో ఎటూ మొగ్గకుండా ఇదిమిత్థం అని తేల్చకుండా తనకు నష్టం కలుగనట్లు చూసుకుంటూ చెప్పే సాక్ష్యాన్ని కోమటి సాక్ష్యం అంటారు. నేడు ఈ విధమైన లౌక్యం తెలిసిన వారు లెక్కకు మిక్కిలి.

(అసలు కథకు కొన్ని మార్పులు చేసి ప్రచురించడం జరిగింది.)

**"మక్కికి మక్కి నకలు" సామెత కథ వచ్చే సంచికలో ...**